గుర్తింపుకార్డులు లేని వారిని అనుమతించొద్దు

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): గుర్తింపుకార్డులు లేని ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించవద్దని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్వాన్, బహదూర్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్ కేంద్రాలను, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, చార్మినార్ డీఆర్‌సీ సెంటర్లలోని ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాల్లో పోలింగ్ ముందు రోజు సిబ్బంది ఉండేందుకు గదులను, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తయిన వెంటనే బాక్స్‌లను, హోమ్ ఓటింగ్‌కు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని సూచించారు.

మేము చేసిన అభివృద్ధి చూసి ఓటేయండి

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలే

జడ్పీచైర్మన్‌గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను ఎంతో అభివృద్ధి చేశా

ఎంపీగా గెలిపిస్తే బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటా

బీఆర్ఎస్ హయాంలో శివారు ప్రాంతాల అభివృద్ధి

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

ఇంటర్వ్యూ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను ఇపుడు ప్రజలు పదే పదే గుర్తుకు తెచ్చుకుంటున్నారని చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పాలనలో అన్ని విధాలా విఫలమైందని.. ఏ ఒక్క హామీ సరిగా నెరవేర్చలేదన్నారు. గతంలో తమ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓట్లేయాలని ఆయన ప్రజలను కోరుతున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా అయన పలు అంశాలపై మాట్లాడారు. గతంలో తాను జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని.. ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. ఇంటర్వ్యూలో ఆయన ఏమన్నారంటే..

కాంగ్రెస్ చేసిందేమీ లేదు

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మా వైపే ఉన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ రాష్ట్ర ప్రజలకు ఇప్పటి వరకు చేసిందేమీ లేదు. పేరుకే గ్యారెంటీలు కానీ ఒక్కదాన్నీ ఇప్పటి వరకు నెరవేర్చలేదు. అందుకే ప్రజలు కూడా విసిగిపోయారు. ఎక్కడకు వెళ్లినా టీఆర్ఎస్ పాలనే బాగుందంటున్నారు. ఇచ్చిన హామీలు నెరవర్చేని కాంగ్రెస్ మళ్లీ ప్రజలను ఓటు అడిగే హక్కును కోల్పోయింది. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరెంట్, నీళ్ల కోసం జనం అల్లాడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. నగర, శివారు ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు తాగునీటి కోసం విలవిల్లాడుతున్నారు. రుణమాఫీ లేదు... రైతుబంధు లేదు... ఆడపిల్లలకు తులం బంగారం పథకం ఎక్కడకు పోయిందో తెలియదు. అధికార పార్టీ నేతల అబద్ధాలు, శుష్క వాగ్దానాలను ప్రజలు అర్థం చేసుకున్నారు. బీజేపీ కూడా ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం నడపాలని చూస్తోంది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ఈ ప్రాంతానికి ఏ ఒక్క మంచి పనీ చేయలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చుట్టూ కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును గంగలో కలిపారు. రాష్ట్రం కోసం ఒక్క ప్రాజెక్టునూ బీజేపీ నేతలు తీసుకురాలేకపోయారు. అందుకే ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.



బడుగులకు బాసటగా ఉంటా...

చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్‌కు రుణపడి ఉంటాను. అతిపెద్ద నియోజకవర్గాల్లో ఒక్కటైన చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి వెనుకబడిన వర్గానికి చెందిన నాకు పోటీ చేసే అవకాశం కల్పించారు. మాజీ మంత్రి కేటీఆర్, సబితారెడ్డి సహకారంతో పాటు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ముఖ్యనేతల సహకారంతో ఈ ఎన్నికల్లో విజయం సాధించబోతున్నాం. గత బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి పనులే నన్ను గెలిపించబోతున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే బడుగులకు బాసటగా ఉంటాను. నా జీవితమంతా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికే పాటుపడ్డాను. అణగారిన వర్గాల కోసం ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. నాకు ఇక్కడ నుంచి ఎంపీగా అవకాశం కల్పిస్తే ఈ ప్రాంత ప్రజలకు మరింత సేవ చేస్తాను. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కాలం పనిచేశాను. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఈ ప్రాంతంలో రోడ్లు, స్కూళ్లు నిర్మించడంతో పాటు తాగునీటి పథకాలను దాదాపు అన్ని గ్రామాల్లో అమలు చేసేందుకు కృషి చేశాను. నేను ఈ ప్రాంతం వాడిని. ఈ ప్రాంత ప్రజలకు కొన్ని దశాబ్ధాల అనుబంధం ఉంది. మిగతా అభ్యర్థులను కూడా బేరీజు వేసుకుని ఎన్నికల్లో ఓటు వేయండి. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలు అంతా ఇంతా కాదు. ప్రచారానికి ఎక్కడకు వెళ్లినా ప్రజలంతా ఉత్సాహంతో సభలకు వస్తున్నారు.

111 జీవో సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ శివార్లలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున కల్పించాం. కేటీఆర్ కృషితో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ కొలువుదీరాయి. ఇందువల్ల లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వచ్చాయి. అలాగే హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో అమల్లో ఉన్న 111జీవో వల్ల స్థానికంగా 83 ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాలు ఈ జీవో వల్ల అభివృద్ధికి నోచుకోకపోవడంతో మా ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేసింది. గతంలో ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవోను రద్దు చేయడంతో కొన్ని లక్షల మందికి ప్రయోజనం కలిగింది. ఈ ప్రాంతంలో భూములు ఉన్న రైతులు సంతోషపడ్డారు. ఇక ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీటిని అందించేందుకు రూపుదిద్దిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభమయ్యాయి. ఐటీ పార్కులు, ఇండస్ట్రియల్ పార్కులు, ఎన్నో ఏర్పాటు చేసి పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాం. ఇలా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటినీ చూసి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నాను.

ప్రజలు మోదీ పాలనను మళ్లీ కోరుకుంటున్నారు

● బీజేపీ రాష్ట్ర నేతలు అందెల, కొలన్

సరూర్‌నగర్, మే 10(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు మరోసారి మోదీ పాలనను కోరుకుంటున్నారని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ స్థానాలు దక్కించుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం బాలాపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో శంకర్‌రెడ్డి పాల్గొనగా.. నాదర్‌గుల్, బడంగ్‌పేట్ ప్రాంతాల్లో శ్రీరాములుయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి మచ్చలేని తమ అభ్యర్థి కొండా భారీ ఆధిక్యతతో విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందని, ప్రస్తుత కాంగ్రెస్ పాలన సైతం అలాగే కొనసాగుతున్నదని వారు ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణలోనూ అధికారం చేపట్టే దిశగా బీజేపీ అడుగులు వేయనున్నదని వారు పేర్కొన్నారు.

బీజేపీలో పలువురు చేరిక

మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 35వ డివిజన్‌కు చెందిన పలువురు ఇతర పార్టీల యువకులు శుక్రవారం అందెల శ్రీరాములుయాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అందెల మాట్లాడుతూ మీర్‌పేట్ కార్పొరేషన్‌లో తమ పార్టీ పటిష్టంగా ఉన్నదని, లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ తమ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డికి భారీ మెజారిటీ పక్కా అని ధీమాగా పేర్కొన్నారు. బీజేపీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని, వారి సేవలను పార్టీ వినియోగించుకుంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు రాఘవేందర్‌ముదిరాజ్, మనీశ్, రాజేశ్, రాజు, నర్సింగ్, సంతోష్, విష్ణు, అంజి, శివప్రసాద్ పాల్గొన్నారు.



ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన వారితో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములుయాదవ్

పైప్‌లైన్ పనుల అడ్డగింత

హయత్‌నగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ లేక్ (ఇరిగేషన్) అధికారులు ప్రజలకు ఉపయోగపడే పనులు మరిచి పోయి కాంట్రాక్టర్ల ద్వారా కమీషన్లు వచ్చే పనులను మాత్రమే చేస్తున్నారని హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి ఆరోపించారు. హయత్‌నగర్ కుమ్మరికుంట నుంచి బాతుల చెరువు వరకు పొడిగిస్తున్న రైన్ వాటర్ పైపులైన్ పనులను స్థానికులతో కలిసి శుక్రవారం అడ్డుకున్నారు. వరద నీటితో చెరువును నింపాలనే సామనగర్ ప్రాంతం నుంచి రైన్ వాటర్ కోసం పైపలైన్ కుమ్మరికుంట వరకు వేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ లైనును బాతుల చెరువుకు పొడిగిస్తున్నారని తెలిపారు. పైపులైన్ పొడిగిస్తే కుమ్మరికుంట చెరువు ఎలా నిండాలని ప్రశ్నించారు. వర్షంనీటి పైపులైన్ పొడిగింపు పనులు ఆపాలని లేనిచో గ్రామస్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



రైన్ వాటర్ పొడిగింపు పనులు అడ్డుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



దిల్‌సుఖ్‌నగర్‌లోని అనిబిసెంట్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫేర్‌వెల్ శుక్రవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా సాగింది. మహిళను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న ఏకైక సంకల్పంతోనే అనిబిసెంట్ కళాశాల ఏర్పడిందని కళాశాల కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. విద్యావంతురాలైన మహిళలతో కుటుంబంతోపాటు అన్నివిధాలుగా ఆర్థిక పురోగాభివృద్ధి సాధించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజవల్లి పాల్గొన్నారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న అడిషనల్ డీసీపీ, ఏసీపీ

హఫీజ్‌బాబానగర్‌లో కార్డన్ సెర్చ్

● 35ద్విచక్ర వాహనాలు సీజ్

చంపాపేట, మే 10(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్‌లోని సీ బ్లాక్‌లో శుక్రవారం రాత్రి సౌత్‌ఈస్ట్ జోన్ పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 35ద్విచక్ర వాహనాలు, నాలుగు ఫోర్ విల్లర్ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలువురు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ స్వామి, చంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డితో పలువురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దోస్త్ సహాయక కేంద్రం ప్రారంభం

హయత్‌నగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని డిగ్రీ కళాశాలలో దోస్త్ సహాయక కేంద్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నప్రభ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో విద్యార్థులకు ఏదైన సాంకేతిక ఇబ్బంది కలిగినట్లయితే ఈ సహాయక కేంద్రం ద్వారా పరిష్కారం పొందవచ్చునని అన్నారు. డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీ కోసం మే 6వ తేది నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. మూడు విడతలుగా నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. దోస్త్ రిజిస్ట్రేషన్ కోసం పదవ తరగతి మెమో, హాల్ టికెట్ నంబర్, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, ఒకటవ తరగతి నుంచి ఇంటర్ మీడియట్ వరకు స్టడి, కండక్ట్ సర్టిఫికెట్లు, ఫొటోలు తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, దోస్త్ కో- ఆర్డినేటర్ అమరేందర్‌రెడ్డి, అడ్మిన్ కో- ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చిన్నారి పాటకు స్పందించిన మోదీ

● రీట్వీట్ చేసిన కాపీపై ఆటోగ్రాఫ్

రాంనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి కుమార్తె జశోధర 2023 డిసెంబర్ 9న దత్తాత్రేయ ఇంట్లో జరిగిన ఓ శుభకార్యంలో పాటపాడింది. ఈ పాట ను దత్తాత్రేయ మోదీకి అదే రోజు ట్వీట్ చేశారు. మరుసటి రోజు చిన్నారిని పొగుడుతూ మోదీ రీట్వీట్ చేశారు. రీట్వీట్ చేసిన కాపీని శుక్రవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో మోదీకి విజయలక్ష్మి చూపించి దానిపై ఆటోగ్రాఫ్‌ను తీసుకున్నారు. జశోధర పాడిన పాటను తాను చూశానని, ఆమెకు తన ఆశీస్సులు అని మోదీ తెలియజేసినట్లు విజయలక్ష్మి పేర్కొన్నారు. తాను రీట్వీట్‌ను మోదీకి చూపించగానే తనకు గుర్తుందని చెప్పడం ఎంతో సంతోషం కలిగిందన్నారు.



రీట్వీట్ చేసిన కాపీపై మోదీ ఆటోగ్రాఫ్ తీసుకుంటున్న విజయలక్ష్మి

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట, మే 10(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన నాగోల్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మధు కథనం ప్రకారం.. మల్లె వెంకటేశ్(34) భార్య, పిల్లలతో బండ్లగూడ ఆనంద్ నగర్‌లో ఉండేవాడు. మద్యానికి బానిసై, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. గత నెల 26న భార్య పిల్లలను తీసుకుని రాజీవ్ స్వగృహలో ఉండే తల్లి వద్దకు వెళ్లింది. అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమాని వెంకటేశ్‌కు పలు మార్లు ఫోన్ చేసినా జవాబివ్వలేదు. దీంతో ఆయన గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండేవారికి కాల్ చేసి, పై అంతస్తులో వెంకటేశ్ ఉన్నాడేమో చూడమన్నాడు. వారు వెళ్లి కిటికీలో నుండి చూస్తే వెంకటేశ్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి మల్లె పెద్దులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి, శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల కోసం పనిచేసే కష్టజీవి సీఎం రేవంత్‌రెడ్డి

- సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి వ్యాఖ్య
- చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు వినతి
- బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో రోడ్‌షో

సరూర్‌నగర్, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కొండల్‌రెడ్డి చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా శుక్రవారం రాత్రి బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్‌ల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగ్‌నగర్ కమాన్ నుంచి బడంగ్‌పేట్ గణేశ్ చౌరస్తా వరకు నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేపడుతున్నదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కష్టపడి ఉన్నత స్థానానికి చేరుకున్న వ్యక్తి అని, ఆయన నిరంతరం ప్రజల కోసం పనిచేసే కష్టజీవి అని ఆయన అన్నారు. చేవెళ్లలో సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డిని మరోసారి గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పాలనను చూడండి.. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టండి అని ఆయన ఓటర్లకు సూచించారు. ఈ సారి కేంద్రంలోనూ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం కొలువుదీరనున్నదని కొండల్‌రెడ్డి పేర్కొన్నారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్‌లలో కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజారిటీ అందించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ అనితాహరినాథ్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి,



బడంగ్‌పేట్ రోడ్ షోలో సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి, పక్కన చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, మేయర్ పారిజాతారెడ్డి తదితరులు

పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దే

ఎల్బీనగర్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రంగారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి పారుపల్లి దయాకర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, బోయిని మహేందర్ యాదవ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్, శంకర్‌నగర్, ఇంద్రహిల్స్, కృష్ణానగర్, జైస్వాల్‌కాలనీలలో పార్టీ శ్రేణులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి వారు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, సుదర్శన్ ముదిరాజ్, నర్సింహగౌడ్, నగేష్‌గౌడ్, కందుల రాము, లక్ష్మయ్య, నాగమణి, శశికళ, సత్తియాదవ్, మొగిళ్ల మల్లేష్ పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారంలో బేర బాలకిషన్, దయాకర్‌రెడ్డి, మహేందర్‌యాదవ్

లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే హవా: పారిజాతారెడ్డి

సరూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తున్నదని, వాటి వల్లనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాదరణ చూరగొన్నదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి గుర్రంగూడ, అల్మాస్‌గూడ గ్రామాల్లో, శుక్రవారం బాలాపూర్, బడంగ్‌పేట్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. అదేవిధంగా బాలాపూర్‌కు చెందిన పలువురు ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో పారిజాతారెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి ప్రజల్లో మంచి పేరు, గుర్తింపు ఉన్నదని, సౌమ్యుడైన ఆయనను మరోసారి గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటేసి రంజిత్‌రెడ్డిని ఆదరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండ్లగూడ ఖల్సా రైతు సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి, వైస్ చైర్మన్ కొలన్ తిరుపతిరెడ్డి, కార్పొరేటర్లు బాలూనాయక్, మహేశ్వరీజైహింద్‌కుమార్, బండారి మనోహర్, కాంగ్రెస్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, బొర్ర జగన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, నీరుడి శ్రీరాములు, గొరిగె శ్రీశైలం, టేకుల శశిధర్‌రెడ్డి, ఇక్కి శ్రీనివాస్, తూళ్ల నరహరి గౌడ్, టేకుల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో..

మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 9,10వ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో శుక్రవారం పార్టీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సాయిచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించనున్న బీఆర్ఎస్

- కేసీఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీల్లో వణుకు
- మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

పరిగి, మే 10: మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల నుంచి స్పందన చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లో వణుకు పుట్టిందని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శుక్రవారం పరిగిలోని ఎస్ గార్డెన్‌లో పరిగి మండలం, మునిసిపల్ పరిధిలోని బీఆర్ఎస్ కార్యకర్తలతో జరిగిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఆ భయంతోనే బడాబాయి(మోదీ), చోటాబాయి(రేవంత్‌రెడ్డి)లు కలిసి రెండు రోజుల పాటు కేసీఆర్ ప్రచారాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకునేలా కుట్రపన్ని చేశారని ఆరోపించారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని, వాటిని ప్రజలు నమ్మి గెలిపిస్తే మరోసారి మోసపోతామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించనుందని తెలిపారు. పదేళ్ల కేసీఆర్ పాలనను చూసిన ప్రజలు, ఈ ఐదు నెలల్లోనే ఎందుకు కేసీఆర్‌ను దూరం చేసుకున్నామని ఆలోచిస్తున్నారని అన్నారు. రేవంత్‌పాలన ఐదునెలల్లోనే గాడి తప్పిందని విమర్శించారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టించుకోని బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని వందలసార్లు బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో మొత్తుకున్నా పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికల కోసం పాలమూరుకు జాతీయహోదా కల్పిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ, కేసీఆర్ టిక్కెట్లు ఇవ్వడంలో బీసీలకు పెద్దపీట వేశారని,



పరిగిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పి.సబితారెడ్డి

చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్న బీసీల ముద్దు బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి గారడీ మాటలు తప్పా, ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాసాని వీరేష్ మాట్లాడుతూ పదేళ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని కోరారు. సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ గట్టు రాంచందర్‌రావు, ఎంపీపీ అరవింద్ రావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, రైతుబంధు మాజీ చైర్మన్ ఎం.రాజేందర్, నాయకులు కె.అనిల్‌రెడ్డి, ఆర్.అంజనేయులు, బి.ప్రవీణ్‌రెడ్డి, ఎస్.భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు: ఆకుల అరవింద్

ఎల్బీనగర్: ప్రజాపాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు ఆకుల అరవింద్‌కుమార్, ఇంటూరి అంకిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం సరూర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి బడుగువర్గాల నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, పందుల రాజు, పోలె అరవింద్, పోలె సుధామ, సుశీలరెడ్డి, రిషి, కట్ట ప్రవీణ్, జహీర్, ఇస్మాయిల్, నరేష్, అభిలాష్, గోపాల్, ప్రత్యూష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కాసానిని గెలిపించాలని అభివాదం చేస్తున్న సబితారెడ్డి, స్వామిగౌడ్, మహేశ్‌రెడ్డి, వీరేష్

మీర్‌పేట్, జిల్లెలగూడలలో..

సరూర్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో మాజీ మంత్రి సబితారెడ్డి చేసిన అభివృద్ధే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మెజారిటీ తెచ్చిపెడుతుందని పలువురు బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ 20వ డివిజన్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షుడు వంటేరు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీర్‌పేట్, జిల్లెలగూడలో వరద ముంపు నివారణకు సబితమ్మ చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదని, అలాంటి ఎన్నో పనులు బీఆర్ఎస్‌ను గెలుపు తీరాలకు చేరుస్తాయని అన్నారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో..

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని వెంకటాపూర్, సుల్తాన్‌పూర్, మల్లాపూర్, బాలాజీనగర్ తదితర కాలనీల్లో శుక్రవారం మాజీ కౌన్సిలర్ దండు గణేశ్‌ముదిరాజ్, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు బొర్ర మాధవరెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసానికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేసి, కారు గుర్తుపై ఓటేయాల్సిందిగా వారు కోరారు. మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీమంత్రి సబితమ్మ ఈ ప్రాంతాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని, ఆమె చేసిన పనుల వల్ల బీఆర్ఎస్‌కు ఇక్కడ మంచి మెజారిటీ రావడం ఖాయమని వారు ధీమాగా చెప్పారు. బీసీల తరఫున పార్లమెంటులో గొంతు విప్పే కాసానిని ఆదరించాలని వారు కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాసానిని గెలిపించాలని సరూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న అరవింద్, అంకిరెడ్డి

గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా: ఈటల

మచ్చబొల్లారం, మే 10(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభకు తనను ఆశీర్వదించి గెలిపించినట్లైతే అభివృద్ధి చేసి చూపిస్తానని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌లోని పలు కాలనీ సభ్యులతో శుక్రవారం ఈటల సమావేశమయ్యారు. ఎన్నికలకు 3 రోజులే సమయం ఉన్నందున ప్రతి ఇంటి తలుపు తట్టి బీజేపీకి ఓటు వేసేలా ఓటర్లను అభ్యర్థించాలని కార్యకర్తలకు, నాయకులకు హితవు చేశారు. ప్రధాని మోదీ దేశానికి ఎనలేని కృషి చేశారని, ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని కావడం తథ్యమని, మల్కాజిగిరి ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని ఎప్పుడో నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు. నెల రోజులకు పైగా నా వెన్నంటి ఉన్న ప్రతి కార్యకర్త, ప్రతి నాయకునికి ఎంతో రుణపడి ఉంటానని, ఈ మూడు రోజులు అత్యంత కీలకమని, ఏమాత్రం అలసత్వం లేకుండా కష్టపడాలని కార్యకర్తలను, నాయకులను కోరారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, శ్రీకాంత్, గోపి, వెంకటేష్, ఆనంద్, పాండురంగ, విఠల్, మల్లికార్జున్‌గౌడ్, రాజిరెడ్డి, ఉదయ్, గణేష్ సుజాత, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి అభివృద్ధి కోసం ఈటలను గెలిపించాలి : ఈటల జమున

మల్లాపూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి అభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఆయన సతీమణి ఈటల జమున పేర్కొన్నారు. మల్లాపూర్ డివిజన్ గుల్మోర్ గార్డెన్స్‌లో శుక్రవారం కాలనీవాసులతో ఆమె సమావేశమయ్యారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేయడంతో పాటు మంత్రిగా రాష్ట్ర ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. మోదీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని అన్నారు. ఈటల మల్కాజిగిరి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటారని తెలిపారు. కమలం గుర్తుపై ఓటు వేసి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ముత్యంరెడ్డి, దొడ్డి యాదగిరి, బోదాసు మాధవి, నిర్మల, సబిత, సుజాత పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

వనస్థలిపురం: ప్రధానిమోదీ నాయకత్వాన్ని బలపర్చడానికి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు బీజేపీలోకి చేరడంతో తన విజయం ఖాయమైందని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ పార్టీ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు టైగర్ విజయ్‌తో ఆయన అనుచరులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇతర పార్టీల నాయకులు తన గెలుపు కోసం బీజేపీలో చేరడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్న యాదవ్, కౌశిక్ మహర్షి, వినీల్, భార్గవ్‌తేజ, భగీరథ తదితరులు పాల్గొన్నారు.



మచ్చబొల్లారం డివిజన్ పలు కాలనీ సభ్యులతో సమావేశమైన ఈటల రాజేందర్

ఉద్యమకారుడు ఈటలను గెలిపించండి: ఈటల జమున

ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుడు ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌లోని రాఘవేంద్రస్వామి మఠంలో జమున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని బలపర్చడానికి మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పోచంపల్లి గిరిధర్, తడకమళ్ల రవి కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో ఈటలదే విజయం

- మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కాప్రా: మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి తదితరులు శుక్రవారం బీజేపీలో చేరారు. బేతి సుభాష్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేష్, రామ్ ప్రదీప్, బ్రహ్మచారి, రమేష్ పాల్గొన్నారు.

ఓటు మీది.. అభివృద్ధి బాధ్యత నాది: రాగిడి

మల్లాపూర్: పదేళ్ల అభివృద్ధిని కళ్లారా చూసిన ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే, మల్కాజిగిరి అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్‌లో శుక్రవారం ఎమ్మె ల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి పాదయాత్ర చేశారు. నాచారం ప్రధాన రహదారి నుంచి భవానీనగర్, ఓల్డ్ మల్లాపూర్ మీదుగా పాదయాత్ర కొనసాగింది. పాతికేళ్లుగా జనం మధ్య లో ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్నానని ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

కాప్రా: ప్రజలకు అందుబాటులో ఉండి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి శుక్రవారం హెచ్‌బీకాలనీలో ఆయన ప్రచారం నిర్వహించారు. జై తెలంగాణ, జై కేసీఆర్, కారు గుర్తుకే మన ఓటు నినాదాలతో ప్రచారం హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి లక్ష్మారెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జి. శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజాసమస్యలను గాలి కి వదిలేసిందని, మల్కాజిగిరి అభివృద్ధికి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్‌లోని ఇందిరానగర్ నుంచి మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్ వరకు భారీ ర్యాలీతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కారు గుర్తుకు ఓట్లు వేసి మరింత అభివృద్ధికి పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, కోసనం ధనలక్ష్మివెంకట్‌రెడ్డి, టంగుటూరి నాగరాజు, జగదీశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్‌కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్, లక్నోచికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్ అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్నివర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు మరో రెండు రోజులు అందుబాటులో ఉంటుందని అక్బర్‌అలీ పేర్కొన్నారు.



ఎగ్జిబిషన్‌లో చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు



తట్టిఅన్నారంలో సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్

కాంగ్రెస్ మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దు

- భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

అబ్దుల్లాపూర్‌మెట్, మే 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చెప్పే అబద్ధపు మాటలను నమ్మి మరోసారి ప్రజలు మోసపోవద్దని భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం జీవీఆర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆల్ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో నన్ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఈదమ్మల బలరాం, దేవిడి విజయభాస్కర్‌రెడ్డి, దామోదర్, వెంకటేశ్వర్‌రెడ్డి, రావుల గోపాల్‌గౌడ్, కోటేశ్వరరావు, పరుషరాం పాల్గొన్నారు.